క్లుప్తంగా

తాగునీటికి ఇబ్బందులు

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని గాంధీచౌక్ నుంచి శివాజీ చౌక్ వరకు ఆయా కాలనీలలో తాగు నీటికి కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పంచాయతీ పాలకవర్గం పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం పంచాయతీ కుళాయిల ద్వారా ఒకపూట నీరు వదులుతున్నారని, కానీ మా గల్లీలో నీరు రావడం లేదని పలుమార్లు సర్పంచ్, పంచాయతీ సిబ్బందికి విన్నవించిన ఫలితం లేకుండ పోయిందని వారు వాపోయారు.నూతన ఎమ్మెల్యే, అధికారులు ఈ విషయంపై తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

పాలాభిషేకం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మదన్‌మోహన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎల్లారెడ్డి నియోజక వర్గం అభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డి రూ.10 కోట్లను మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పండ్లు, మిఠాయిలను పంపిణీ చేశారు. నాయకులు వెంకట్‌రాంరెడ్డి, షౌకత్‌అలీ, సాయిరెడ్డి, శ్యాంరావు, రాంచంద్రం, తదితరులు పాల్గొన్నారు.

జైపాల్‌రెడ్డి జయంతి వేడుకలు



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దివంగత మాజీ కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి జయంతి వేడుకలను మంగళవారం కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. జైపాల్‌రెడ్డి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు గయాజుద్దీన్, చెన్న లక్ష్మణ్, కుర్మ సాయిబాబా, సామెల్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్, వాలీబాల్ కిట్ల పంపిణీ



లింగంపేట(ఎల్లారెడ్డి): పర్మళ్ల గ్రామానికి చెందిన క్రీడాకారులకు మంగళవారం గ్రామ సర్పంచ్ పర్వయ్య, ఉపసర్పంచ్ భూపాల్ ఆధ్వర్యంలో క్రికెట్, వాలీబాల్ క్రీడల కిట్లు పంపిణీ చేశారు. యువతలో క్రీడాకారులను ప్రోత్సహించడానికి కిట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. లెగ్గల రాజు, అశోక్, మహేష్, ప్రభు రాజం, ప్రసాద్, ఆశయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



బాన్సువాడ రూరల్: ఇబ్రహీంపేట్ గ్రామానికి చెందిన చిట్టి సంజీవ్ ఇటీవల ప్రమాదంలో మృతి చెందారు. కాగా గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం సభ్యులు మంగళవారం కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబానికి తాము అండగా ఉంటామని ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందించారు. పుట్టి శంకర్, గంగారాం, అంబయ్య, దుర్కి గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలో..

రాజంపేట: మండల కేంద్రానికి చెందిన గ్యార బాలయ్య నివాస గృహం ఇటీవల షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయింది. దీంతో ఇంట్లోని నిత్యావసర వస్తువులు, దుప్పట్లు కాలి బూడిదయ్యాయి. సమాచారం తెలుసుకున్న సర్పంచ్ ఆముద సౌమ్య దంపతులు ఆదివారం బాధిత కుటుంబానికి బట్టలు, దుప్పట్లులతో పాటు రూ.2 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

అక్షింతల పంపిణీ

రాజంపేట: ఆరేపల్లి తండాలో మంగళశారం శ్రీ రామ జన్మభూమి తీర్ధ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటికి అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. మహిళలు మంగళహారతుల మధ్య అక్షింతలను స్వీకరించారు. కేతావత్ రవీందర్, ముదావత్ నరేందర్, భిక్న, అనిల్, రవి, సుధాకర్, శేఖర్, సంతోష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. సోమవారం నాటికి లక్షా 91 వేల 143 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.



గుర్జకుంట జట్టుకు మెమెంటో అందజేస్తున్న భిక్కనూరు సర్పంచ్ తున్కి వేణు



సదాశివనగర్‌లో ముగ్గులు వేస్తున్న చిన్నారులు



లింగంపేటలో ..



కామారెడ్డిలో గొబ్బెమ్మలు పెడుతున్న మహిళలు



దేవునిపల్లిలోని గాయత్రీ నగర్‌కాలనీలో..

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు



రాజంపేటలో ముగ్గులు వేస్తున్న మహిళలు



ఎల్లారెడ్డిలో ముగ్గులు వేస్తున్న యువతులు



పిట్లంలో భారీ ముగ్గు వేస్తున్న యువతులు



క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న నాగిరెడ్డిపేట ఎంపీపీ, జెడ్పీటీసీ



దేవునిపల్లిలో..

సాక్షి నెట్‌వర్క్: జిల్లాలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగలు వరుస దినాల్లో గ్రామాల్లో సందడి నెలకొంది. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో ముగ్గుల పోటీలు, ఆటల పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి నిర్వాహకులు బహుమతులు అందజేశారు. చిన్నారులు, పెద్దలు గాలిపటాలు ఎగురవేస్తూ ఉత్సాహంగా గడిపారు. మంగళవారం కనుమ కావడంతో చికెన్, మటన్ షాపులు కిక్కిరిసి పోయాయి.



దోమకొండలో ..



గాలిపటాలతో రాజంపేట హిందూదళ్ యువకులు



మద్నూర్‌లో పూజలు చేస్తున్న మహిళలు



రాంపూర్ తండాలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న గ్రామపెద్దలు



భిక్కనూరులో..



ఎల్లారెడ్డిలో మటన్ కొనుగోలు చేసేందుకు గుమిగూడిన జనాలు



బీబీపేటలో..

పీకి పందిరేస్తున్న కోతులు

- పల్లెల్లో మకాం వేసిన వానర మూకలు
- ఫలితమివ్వని మంకీ ఫుడ్ కోర్టులు



ఇంటిపై తచ్చాడుతున్న కోతులు



బోర్లంలో కోతులు చిందర వందర చేసిన కూన పెంకులు

బాన్సువాడ రూరల్: అడవులను వదిలి పల్లెల్లో మకాం వేసిన వానర మూకలు నిత్యం కిష్కింధకాండను సృష్టిస్తున్నాయి. అడవులను విచ్చలవిడిగా నరికి వేయడం వల్ల తినడానికి పండ్ల చెట్లు లేక, తాగటానికి నీళ్ల లేక కోతులు జనావాసాల మధ్యకు వస్తున్నాయి. గ్రామాల్లో అధికంగా ఉండే పెంకుటిళ్లను టార్గెట్ చేసుకుని గ్రామస్తులకు తీవ్ర ఆస్తినష్టం కలిగిస్తున్నాయి. ఇళ్లపై అమర్చిన పెంకులను కిందకు పారేస్తూ గ్రామస్తుల సహనానికి పరీక్ష పెడుతున్నాయి. దుకాణాల నుంచి బ్రెడ్లు, గుడ్లు ఇలా ఏమైనా వస్తువులు కొనుగోలు చేసుకుని వెళ్తుంటే దాడులు చేసి లాక్కెళ్తున్నాయి. ఈక్రమంలో పలువురిపై దాడులకు పాల్పడి గాయపరుస్తున్నాయి. జిల్లాలో గతంలో అడవులకు సమీపంలో ఉన్న గ్రామాల్లోనే తిష్ట వేసిన కోతులు ప్రస్తుతం పల్లె, పట్నం తేడా లేకుండా అన్ని చోట్ల దర్శనమిస్తున్నాయి.

నేరుగా ఇళ్లలోకే చొరబాటు..

మొదట్లో ఇళ్లపైనే సంచరించిన వానర మూకలు క్రమంగా ఇళ్లలోనికి ప్రవేశించి వంట పాత్రలను తీసుకెళ్తున్నాయని మహిళలు వాపోతున్నారు. ఇంట్లో పసిపిల్లలు ఉన్నవారు మాత్రం గడపదాటకుండా వారికి రక్షణగా ఉండాల్సిన పరిస్థితి నెలకొందని వారు వాపోతున్నారు. గ్రామాల్లో వివిధ కాలాల్లో కాచే చింత చెట్లు, మామిడి, మునగ చెట్లపై ఎక్కి కాత, పూతలను రాల్చి వేస్తూ నష్టాన్ని కలిగిస్తున్నాయి. వాటిని వెళ్ల గొట్టే ప్రయత్నం చేస్తే తిరగబడి గాయపరుస్తున్నాయి. వాటిని చూస్తే సాలు జనాలు పరుగు పెడ్తున్నారు. ఈ విషయమై పలుమార్లు అటవీ శాఖాధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం ఉండటం లేదంటున్నారు.

నిజాంసాగర్ ప్రధాన కాలువకు ఆనుకునే..

నిజాంసాగర్ ప్రధాన కాలువకు సమీపంలో ఉన్న గ్రామాల్లో కోతుల సంఖ్య మరింత ఎక్కువగా ఉంది. అటవీ శాఖ అధికారులు అడవుల్లో వాటి కోసం తాగునీటి సాసర్‌పిట్‌లు కట్టించడం కానీ, పండ్ల మొక్కలు నాటించడంలో పెద్దగా ఆసక్తి చూపడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు పోడు వ్యవసాయం వల్ల అడవులను నరికి పొలాలుగా మార్చడంతో వాటికి రక్షణ లేక పల్లెబాట పడుతున్నాయి. ఉపాధిహామీ పథకంలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం గ్రామ శివార్లలో ఏర్పాటు చేసిన మంకీ ఫుడ్‌కోర్టులతో ఎలాంటి ప్రయోజనం వాటిల్లే అవకాశాలు కనుచూపుమేరలో కన్పించడం లేదు. రికార్డుల్లో ప్రతి పంచాయతీ పరిధిలో ఫుడ్‌కోర్టులు ఉన్నా వాటిలో నాటిన పండ్ల మొక్కలు మాత్రం ఎండిపోయాయి. అధికారులు స్పందించి అడవి జంతువులు జనావాసాల మధ్యకు రాకుండా ఉండేందుకు అడవుల్లో పండ్ల చెట్లు పెంచి నీటి సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. లేదంటే కోతుల్ని పట్టుకుని జూకు తరలించాలంటున్నారు.

పాత కూన పెంకుల స్థానంలో రేకులు..

మామూలుగా గ్రామాల్లో కుమ్మరి చక్రంపై తయారు చేసిన కూన పెంకులతో కూడిన ఇళ్లే ఎక్కువగా దర్శనమిస్తాయి. పెంకుటిళ్లపై పెంకుల్ని కోతులు తొలంగించటంతో వర్షాకాలంలో ఉర్పులతో అవస్థలు ఎదుర్కొంటున్నారు. రూ.వేలు ఖర్చుపెట్టి పాత కూన ప్రదేశంలో బెంగుళూరు, బొంబాయి కూనలు, రేకులు అమర్చుకుంటున్నారు. ఇంటి ప్రధాన ద్వారాలు, షట్టర్లకు జాలీ డోర్లను ఏర్పాటు చేసుకుంటున్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న ఏఎంవీఐ, ఎస్సై

తాడ్వాయి(ఎల్లారెడ్డి): రోడ్డు భద్రతపై అవగాహన అవసరమని, ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఏఎంవీఐ విక్రమ్, ఎస్సై ఆంజనేయులు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు, వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. పెద్ద వాహనాలు నడిపేటప్పుడు బెల్టులు, బైక్‌లు నడిపేవారు హెల్మెట్లు తప్పనిసరిగా ధరించాలని, లేకుంటే జరిమానా విధిస్తామని పేర్కొన్నారు. వాహనాలను వేగంగా నడపొద్దని, ఓవర్ టేక్ చేయవద్దని సూచించారు. మీ కోసం కుటుంబసభ్యులు ఎదరుచూస్తారన్న విషయం మరువొద్దని సూచించారు. సర్పంచ్ సంజీవులు, వైస్‌ఎంపీపీ నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



టోర్నమెంట్ ప్రారంభిస్తున్న నాయకులు

పిట్లం(జుక్కల్): సంక్రాంతి పండగను పురస్కరించుకొని మండల కేంద్రంలో సోమవారం వివేకానంద పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ నిర్వాహకులు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ..టోర్నమెంట్ విన్నర్‌కు ట్రోఫీతో పాటు నగదు, రన్నర్‌కు ట్రోఫీతో పాటు నగదును అందజేస్తామన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు బోడ్లరాజు, షేక్ నజీర్, శివ, రాజు రాథోడ్, అద్నాన్, తదితరులు పాల్గొన్నారు.

ఐదు వందల ఏళ్ల కల నెరవేరనుంది



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు పైడి ఎల్లారెడ్డి

లింగంపేట(ఎల్లారెడ్డి): దేశ ప్రజల ఐదు వందల ఏళ్ల కల ఈ నెల 22న నెరవేరబోతోందని ప్రముఖ శాస్త్రవేత్త, బీజేపీ నాయకుడు పైడి ఎల్లారెడ్డి అన్నారు. సోమవారం ఆయన లింగంపేట మండల కేంద్రంలో మాట్లాడారు. 22న దేశ ప్రజలు అంబరాన్నంటే సంబరాలు జరుపుకోవాలన్నారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణం చేపడుతున్న వేళ ప్రతి గ్రామంలో మోదీ పిలుపు మేరకు దేవాలయాలను శుద్ధి చేయాలన్నారు. తాను సేవ చేయడానికే రాజకీయాలకు వచ్చానన్నారు. జహీరాబాదు పార్లమెంటు నియోజకవర్గాన్ని తన శక్తికి మించి అభివృద్ధి చేస్తానన్నారు. ఇప్పటికే 110కి పైగా వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. అలాగే పలు రకాల సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. న్యాయవాది నారాయణ, తోట సాయిలు, సత్యనారాయణరెడ్డి, రమేశ్, మహేష్, సాయిలు, దుర్గాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గర్గుల్ క్రికెట్ ప్రీమియర్ లీగ్



బహుమతులు ప్రదానం చేస్తున్న సర్పంచ్ రవితేజగౌడ్

కామారెడ్డి రూరల్: గర్గుల్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న గర్గుల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ మ్యాచ్ మంగళవారం ముగిసింది. గ్రామ సర్పంచ్ చింతల రవితేజగౌడ్ సహకారంతో మ్యాచ్‌లు నిర్వహించారు. మొదటి స్థానంలో కేఎఫ్‌సీ టీం, రెండో స్థానంలో ఈగల్ వారియర్స్ నిలిచాయి. సర్పంచ్ చింతల రవితేజగౌడ్ మాట్లాడుతూ.. యువకులు అన్ని రంగాల్లో రాణించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో యేసు స్వామి, గణేష్, జీవన్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను వివరించాలి



నస్రుల్లాబాద్(బాన్సువాడ): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి యెండల లక్ష్మీనారాయణ అన్నారు. బొమ్మన్‌దేవ్‌పల్లిలో మంగళవారం వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కార్యకర్తలు గట్టిగా పని చేయాలన్నారు. జిల్లా నాయకులు శంకర్ గౌడ్, మండల అధ్యక్షుడు సున్నం సాయిలు, చందూరి హన్మండ్లు, శ్రీనివాస్, మహిళా మోర్చా అధ్యక్షులు సావిత్రి ఉన్నారు.

చిన్న పిల్లలకు మేథాశక్తి పోటీలు



ఆటల పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): క్రిష్ణాజీవాడి గ్రామంలోని హన్‌మాన్‌గల్లీలో చిన్న పిల్లలకు మేథాశక్తి, ప్రాధాన్యతా ఆటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ .. ఈ ఆటల వల్ల పిల్లలకు మేథాశక్తితో పాటు పిల్లల్లో చైతన్యం, ఐకమత్యం పెరిగి ఆనందంగా, ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మోహన్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, రమేశ్, జగన్, గంగారాజు, శివకృష్ణ, సంతోష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

విజేతగా నిలిచిన కొండాపూర్ ఫైటర్స్

రాజంపేట: కొండాపూర్‌లో నిర్వహించిన కొనకలి చిరంజీవి జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ పోటీలో గ్రామానికి చెందిన కొండాపూర్ ఫైటర్స్ ప్రథమ స్థానంలో నిలిచింది. క్రేజీ బాయ్స్ టీమ్ ద్వితీయ స్థానంలో నిలిచింది. నిర్వాహకులు మంగళశారం విజేతలకు ట్రోఫీలను అందజేశారు.

వాలీబాల్ విజేతలకు బహుమతుల పంపిణీ

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపల్లి(ఖుర్దు)లో సంక్రాంతి సంబరాలను పురస్కరించుకొని నిర్వహించిన వాలీబాల్ క్రీడల్లో గెలుపొందిన విజేతలకు మంగళవారం లింగంపేట ఎస్సై ప్రభాకర్ బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో 14 జట్లు తలపడగా మొదటి బహుమతి ఛత్రపతి శివాజీ యూత్, ద్వితీయ బహుమతి హైందవ సేన యూత్, తృతీయ బహుమతి అంబేడ్కర్ యువజన సంఘం జట్లు గెలుపొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. క్రీడాకారులను ప్రోత్సహించడానికి గ్రామ సర్పంచ్ బండి రాజయ్య వాలీబాల్ క్రీడలను నిర్వహించడం హర్షణీయమన్నారు.

పట్టణ సీఐని కలిసిన ఐవీఎఫ్ ప్రతినిధులు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి పట్టణ నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన చంద్రశేఖర్ రెడ్డిని కామారెడ్డి జిల్లా ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్(ఐవీఎఫ్) అధ్యక్షుడు విశ్వనాధల మహేష్ గుప్తా, ప్రధాన కార్యదర్శి గోవిందు భాస్కర్ గుప్తాలు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి భగవద్గీతను జ్ఞాపికగా అందజేశారు.

ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలి

కామారెడ్డి టౌన్: టీపీసీసీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి, జిల్లా అధ్యక్షురాలు పాక జ్ఞానేశ్వరికి ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని జిల్లా గంగపుత్ర ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్, ఫిషరీస్ సొసైటీ సభ్యులు సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కామారెడ్డి పెద్ద చెరువు వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గంగపుత్రుల అభివృద్ధి కోసం రాష్ట్ర కార్పొరేషన్ పదవి ఇవ్వాలని కోరారు. గంగపుత్ర సంఘాలన్నీ తీర్మానాలు చేసిన ప్రతులను సీఎంకు పంపించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా గంగపుత్ర ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పాక వెంకటి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేపీ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ఐదు సెల్‌ఫోన్ల అప్పగింత

కామారెడ్డి టౌన్: కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను రికవరీ చేసి పట్టణ పోలీసులు మంగళవారం యజమానులకు అప్పగించారు. సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా గుర్తించి బాధితులకు అందజేసినట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

మకర జ్యోతి దర్శనం



బాన్సువాడ: బాన్సువాడ అయ్యప్ప ఆలయంలో సోమవారం రాత్రి భక్తులు మకర జ్యోతి దర్శనాన్ని వీక్షించారు. సంక్రాంతి పురస్కరించుకుని శబరిమలలో జ్యోతి దర్శన భాగ్యం కలుగుతుంది. బాన్సువాడ అయ్యప్ప ఆలయంలో భక్తుల సౌకర్యార్థం టీవీని ఏర్పాటు చేసి జ్యోతి దర్శన భాగ్యం కల్పించారు.